క్లుప్తంగా

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారికి మహామంగళహారతి ఇస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ బ్రహ్మోత్సవాలు చక్రతీర్థం, మహామంగళ హారతితో శనివారం ఘనంగా ముగిశాయి. దేవాలయంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు స్వామివారికి వేదపండితులు, అర్చకులు, భక్తులు చక్రతీర్థం, ప్రసాదం, మహా మంగళహారతి సమర్పించారు. దీంతో ఆలయంలో గోవింద నామస్మరణతో మార్మోగింది. చివరిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓలు, ఎంఈఓ

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు, ప్రస్తుత సంగారెడ్డి ఎంపీడీఓ సత్తయ్య, మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. పూర్వ విద్యార్థులను వారందరూ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



క్రీడాకారులతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొందుర్గు: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ కొందుర్గు, వాలీబాల్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన 18వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు సంయమనం పాటించి క్రీడలు విజయవంతం చేయాలని సూచించారు. 18 ఏళ్లుగా క్రీడలను విజయవంతం చేయడం మండల యువత గొప్పతనమన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడంతో గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు రాజేశ్‌పటేల్, కావలి యాదయ్య, రామయ్యగౌడ్, కృష్ణ, అక్రమ్, ముబారక్ అలీఖాన్, నరేందర్, జీబీ కృష్ణ, పెంటయ్య, మానయ్య పాల్గొన్నారు.

వీధి దీపాలకు స్విచ్‌లు ఏర్పాటు చేయాలి



పగలు కూడా వెలుగుతున్న లైటు

కొత్తూరు: విద్యుత్‌ను పొదుపుగా వాడడంతో పాటు సాధ్యమైనంత వరకు వృథా చేయొద్దని అధికారులు ప్రకటిస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేని కారణంగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో లైట్లకు ఒక చోటనే స్విచ్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ సిబ్బంది సకాలంలో లైట్లను నిలిపివేయని కారణంగా విద్యుత్ వృథా అవుతోంది. మండలంలోని వైఎం తండాలో ఉన్న వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో పగలు, రాత్రి వెలుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నాయి.

కలగానే కళాశాల..

- ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోని పాలకుల హామీ
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు



మొయినాబాద్‌రూరల్: రైటప్: నగరానికి పైచదువులకు వెళ్తున్న విద్యార్థినులు(ఫైల్)

మొయినాబాద్‌రూరల్: మండలంలో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు నోచుకోవడం లేదు. నగర శివారు ప్రాంతం కావడంతో చేవెళ్ల నియోజకవర్గంలో అనేక పెద్ద పెద్ద ప్రైవేటు కళాశాలలు ఉన్నా.. అందులో విద్యనభ్యసించే స్థోమత లేకపోవడంతో 10వ తరగతి పూర్తిచేసిన ప్రతిభ గల పేద విద్యార్థులు మధ్యలోనే విద్యను ఆపేస్తున్నారు. మండలంలో ప్రతి సంవత్సరం దాదాపు 2 వేల మంది విద్యార్థులకుపైగా పదో తరగతి పాసవుతున్నారు. ఇంటర్ చదవాలంటే హైదరాబాద్, చేవెళ్లకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో మధ్యలోనే పేద విద్యార్థులు పైచదువులకు స్వస్తి చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. గత బీఆర్‌ఎస్‌ప్రభుత్వం ప్రతీ మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అది నేటికీ కలగానే ఉంది.

పైచదువులకు స్వస్తి..

మొయినాబాద్ మండలంలో 14 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం దాదాపు 1500 మంది వరకు విద్యార్థులు పరీక్షలు రాసి పాసవుతున్నారు. ఇంటర్ చదవాలంటే ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించాల్సిందే. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పేద విద్యార్థులకు ఇంటర్ విద్య భారంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా నేతల హామీలు నెరవేరకపోవడంతో విద్యార్థులకు దూర ప్రయాణం తిప్పలు తప్పడం లేదు. మండలంలో పెద్ద ప్రైవేటు కళాశాలలు, పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉన్నా వీటితో మండల పేద ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని పది చదువుతున్న, చదివిన విద్యార్థులు వాపోతున్నారు. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువుతున్న పది పాసై విద్యార్థులు ఇంటర్ విద్య అటు నగరంతో పాటు చేవెళ్లకు వెళ్లాల్సిందే. కానీ అక్కడ ఆయా ప్రాంతాల వారికి ఎక్కువ అవకాశం ఇస్తుండడంతో ఇక్కడ నుంచి వెళ్తున్న విద్యార్థులకు సీట్లు దొరకడం కష్టంగా మారింది. చాలావరకు స్థానికుల తర్వాతే ఇతర వారికి చోటు కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలో చేరి ఫీజుల మోత భరించలేక పైచదువులకు స్వస్తి పలుకుతున్నారు.

మండలం.. ఉన్నత విద్యకు నిలయం

నగర శివారు ప్రాంతమైన మొయినాబాద్ మండలంలో 20 వరకు ఇంజనీరింగ్, 10 ఎంబీఏ, ఎంసీఏ, 2 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఇన్ని కాలేజీలున్నా ఈ ప్రాంతంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు పదో తరగతితోనే చదువు మానేస్తున్నారు. జూనియర్ కాలేజీ ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరుపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే గండిపేట, షాబాద్, శంకర్‌పల్లితో పాటు మొయినాబాద్ మండల విద్యార్థులకు వెసులుబాటుగా ఉంటుంది. ప్రస్తుతం చేవెళ్లలో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. పాలకులు దృష్టిసారించి మొయినాబాద్ మండలంలో కూడా కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నెరవేరని కళాశాల హామీ..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల పాలనలో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చింది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు. మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన మండలంలో ప్రభుత్వ కళాశాల నోచుకోలేదు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళాశాల ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రస్తుతం పది చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దూర ప్రయాణంతో ఇబ్బంది



ప్రతీ మండలానికి ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తామని అధికారులు హామీలిచ్చినా మొయినాబాద్ మండలంలో నోచుకోలేదు. మండలంలో ఇంటర్ కళాశాల లేక విద్యార్థులు దూర ప్రాంతానికి వెళ్లలేకపోతున్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థినులను దృష్టిలో పెట్టుకొని, ఈ ప్రభుత్వంలోనైనా కళాశాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–కె.పూజిత, 10వ తరగతి, హిమాయత్‌నగర్ పాఠశాల

కళాశాల ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారంగా మారింది. గతంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పినా నేటికీ నెరవేరలేదు. పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూర ప్రయాణం చేయాల్సి వస్తోంది. అయినా అక్కడ ఉన్న కళాశాలల్లో సీట్లు దొరకకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో చేరడంతో ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి.

–మంజుల, మాజీ సర్పంచ్, హిమాయత్‌నగర్

పండుగకు ఊరెళ్తున్నారా జరభద్రం

సీఐ కాంతారెడ్డి



బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

షాబాద్: సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా.. అయితే అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్‌స్టేషన్‌లో ప్రజలు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా పెడతామని తెలిపారు. ద్విచక్ర వాహనాలు, కారు ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. రోడ్లపై నిలుపరాదని సూచించారు. బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంక్ లాకర్లలో భద్రపరుకోవాలని చెప్పారు. కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడూ పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100కు సమాచారం అందజేయాలని చెప్పారు. వీలైతే సీసీ కెమెరాలను అమర్చుకుని మీ మొబైల్ యాప్ ద్వారా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేశ్, ఏఎస్‌ఐ రాములాల్‌నాయక్, హోంగార్డు కృష్ణచారి, తదితరులు ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభిస్తున్నామని సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాలతీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 5వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు బోనోఫైడ్, పాస్ ఫొటో, వంద రూపాయల రుసుము చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థికి సంబంధించిన ఏదైనా ఒక ఫోన్ నెంబర్ దరఖాస్తులో నమోదు చేయాలని తెలిపారు. ఏదైనా సందేహాలు ఉంటే 040–23391598లో సంప్రదించాలని కోరారు.



ఆలయ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

దేవాలయాల అభివృద్ధికి కృషి

అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్

షాద్‌నగర్‌రూరల్: దేవాలయాల అభివృద్ధిలో హిందూ బంధువులందరూ భాగస్వాములు కావాలని అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ అన్నారు. పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్‌కాలనీలో గల వీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి శనివారం పట్టణానికి చెందిన దాతలు విశ్రాంత ఎంపీడీఓ దండు శరత్‌చంద్రబాబు, వ్యాపారవేత్త దండు శ్రీనివాస్(వాసు) రూ.51 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రాచీన ఆలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకొని దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం దాతలు దండు శరత్‌చంద్రబాబు, దండు శ్రీనివాస్(వాసు)ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దారు సరాపు జగదీశ్వర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, ఎలికట్ట శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి దేవాలయంలో పూజలు



షాద్‌నగర్‌రూరల్: స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న అర్చకుడు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పరిగి రోడ్డులో గల శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 108 కలశాలలో కుడారై ప్రసాదంతో నైవేద్యాన్ని సమర్పించామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కట్ట ప్రవీణ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కట్ట పుల్లయ్య, ఆలయ అర్చకుడు రాఘవేంద్రాచార్యులు, మహిళా సేవాదళ్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పల్లకీసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం శ్రీరామనామస్మరణతో మార్మోగింది. నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన యాదయ్యగౌడ్ దంపతులు, పట్టణానికి చెందిన పరమేశ్వరి, శేఖర్ దంపతులు అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేశారు.

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

చేవెళ్ల: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్వరలో నిర్వహించబోయే స్వర్ణోత్సవాలకు పూర్వ విద్యార్థులందరూ వచ్చి విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ అడ్‌హాక్ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1955–2025 వరకు చదివిన కొంతమంది పూర్వ విద్యార్థులు కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 70 ఏళ్ల చరిత్ర కలిగి ఉందని, ఈ సందర్భంగా ఈ పాఠశాలలో త్వరలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించాలని పూర్వ విద్యార్థులంతా కలిసి నిర్ణయించామన్నారు. దీనికిగాను 1955 నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ ఈ ఉత్సవాలకు ఆహ్వానితులేనని తెలిపారు. దీనికి పూర్వ విద్యార్థులు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల ఫిబ్రవరి 16వ తేదీ ఆదివారం రోజు ఈ పాఠశాలలోనే మినీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించామని, దీనికి అందుబాటులో ఉన్నవారందరూ రావాలని కోరారు. ఈ మినీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో స్వర్ణత్సోవాలపై చర్చిస్తామన్నారు. మనం చదువుకున్న బడికి మనవంతుగా ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేయటంతో పాటు 70 ఏళ్ల చరిత్రకు గుర్తుగా పాఠశాలలో గుర్తిండిపోయేలా ఉత్సవాలు నిర్వహించాలని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ నిర్ణయించిందని చెప్పారు. పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ కోఆర్డినేటర్లుగా గోపాలచారి, చేగూరి బోజిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్.శ్రీనివాస్, ఖాజాపాషా, ఎం.రమణారెడ్డి, పోచయ్య, కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సత్యనారాయణగౌడ్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, డీవీఆర్, జహంగీర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆగిరెడ్డి, గోపాల్, సంగమేశ్వర్, షఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు

లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి తన జీవితాన్ని దేశానికే అంకితం చేశారని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బహదూర్ శాస్త్రి వర్ధంతిని శనివారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గంజ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. దేశాభివృద్ధికి శాస్త్రి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. మహనీయుడి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, సర్వర్‌పాషా, రాములుగౌడ్, ముబారక్, కృష్ణ, అక్రం, సత్తయ్య, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్: యువత ఉన్నత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. శనివారం కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు క్రీడాకారులకు పుట్టినిళ్లుగా మారాయన్నారు. గ్రామాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసం, దేహ దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో క్రీడలు నిర్వహించి ఐక్యతను చాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింగ్‌రావు, నాయకులు బాల్‌రాజు, సావిత్రి, నవీన్‌కుమార్, కృష్ణయ్య, భూపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, జమాల్‌ఖాన్, సాజిద్, జగన్‌మోహన్, గణేశ్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

మొయినాబాద్: మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు నేర్పించాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువజన సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గులను పరిశీలించి విజేతలకు, పోటీల్లో పాల్గొన్నవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, మాజీ వార్డుసభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ముగ్గుల పోటీలలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు

ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో..

షాద్‌నగర్‌రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు, పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లతాశ్రీశ్రీశైలంగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, అర్చకులు పాల్గొన్నారు.

జాగృతి ఆధ్వర్యంలో..

కొందుర్గు: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 59 మంది మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేసి తమ ప్రతిభను చూపించారు. ఈ సందర్భంగా జాగృతి తాలుకా కన్వీనర్ ముస్తాఫా, మండల కన్వీనర్ సునిత విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

చేవెళ్ల: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలను విద్యార్థులు ముందుగానే జరుపుకున్నారు. శనివారం మండలంలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాల, సత్యసాయి గ్రామర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి, భోగి మంటలు, గంగిరెద్దులతో హరిదాసుల ప్రదర్శనలతో అలరించారు.



మొయినాబాద్: ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య, వార్డు సభ్యులు



కొందుర్గు: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముస్తాఫా



చేవెళ్లలో సంక్రాంతి సంబురాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



చేవెళ్లలోని ఓ పాఠశాలలో హరిదాసు వేషధారణలో విద్యార్థి